# బిచ్చగాడు

ఆ వూరికి దూరంగా ఒక మఱ్ఱిచెట్టు వుంది. అది పెద్ద మఱ్ఱిచెట్టు. దాన్ని ఎవ్వరయినా, నాబోటి వాళ్ళు వుండటానికి నాటారో, ఏ విత్తువడి మొలిచిందో నాకు తెలియదు. ఊడలుదిగి పెద్ద మండువా లోగిలికిమల్లే వుంటుంది. పది ఇరవయి కాపరాలు ఆ చెట్టుకింద బతుకుతున్నాయి. ఏదో అందరికీ బాగానే జరుగుతావుంది.

ఆ చెట్టుకింద వుండే మే మందరం బిచ్చగాళ్ళమే. కుంటివాళ్ళం, గుడ్డివాళ్ళం, నోరులేనివాళ్ళం_రకరకాలవాళ్ళం ఉన్నాం.

ఆ వూరికి దగ్గరలోఉన్న కొండమీద ఒగ పెద్ద దేవుడిగుడి వుంది. అక్కడికి చాలామంది పెద్ద పెద్దవాళ్ళు వస్తూంటారు. కార్లలోకూడా వస్తుంటారు. కార్లు కొండమీదకి వెళ్ళవు. కొండకింద ఆపి వచ్చినవాళ్ళు కొండఎక్కవలసిందే. అందుకని బిచ్చగాళ్ళం అంతా కొండకిందే కూర్చుంటాం. సోలుపుగా కూర్చుంటే వచ్చేవాళ్ళూ పొయ్యేవాళ్ళూ ఎవ్వరికి ఇష్టం వచ్చింది వాళ్ళు విదిలించిపోతుండేవారు.

అయితే నేను మొదటినుంచీ ఇక్కడ వుండేవాణ్ని కాదు. మా దొక పల్లెటూరు. మొదట్లో మాకు కాస్త పొలం కూడా వుండేది. నా చిన్నతనంలో మా వూరు జమీందారు, మా పొలం అన్యాయంగా ఆక్రమించుకొని మమ్మల్ని ఆ గ్రామనుంచి వెళ్ళగొట్టాడు. మా అయ్యా, అమ్మా, నేనూ బతకటానికి పట్టణం వచ్చాం. అప్పటికి నాకు ఆరేడు ఏళ్ళు వుంటై. మేము పట్టణం వచ్చిన వారంరోజులకే మా అమ్మకూ, నాన్నకూ స్ఫోటకం పోసి చచ్చిపోయారు. అక్కడితో నేను ఒంట్రిగాణ్ణి అయిపోయాను. నా బతుకు నేనే బతకవలసి వచ్చింది.

మేమువున్న గుడిసెపక్కన ఒక గుడ్డిమనిషి వుండేది. ఆమెకు

ఎవ్వరూలేరు. రోజూ ఎవ్వరో ఒకరు ఆమెను అడుక్కుతింటానికి వూళ్లోకి తీసుకు వెళ్తుండేవారు. అట్లా తీసుకు వెళ్ళినందుకు ఒచ్చిందాంట్లో ఆమె భాగం పెట్టేది. నాగతి చూచి, "ఇంకొకళ్ళను పెట్టుకోవటం ఎందుకు? నువ్వేరా అబ్బాయి, జతగా" అన్నది ఆ గుడ్డిమనిషి. ఆ రోజు మొదలుకొని అడుక్కోటానికి ఆమెతో నేను వెళుతుండేవాణ్ణి. ఒచ్చిందాంట్లో ఆమె ఏ కాస్త ఇస్తే పొట్టపోసుకునేవాణ్ని.

మామూలుగా మేము కాఫీహోటళ్ళదగ్గర ఎక్కువగా వుంటూ వుండేవాళ్ళం. అక్కడే డబ్బుకాస్త దొరుకుతుండేది. తిని బయటకు వచ్చేటప్పుడు వాళ్ళచేతుల్లో చిల్లర వుంటూ వుండేది. అప్పుడు అడిగితే ఏ నయాపైసో మా బొచ్చెలో వేసి వెళుతుండేవాళ్లు. ఒక్కమనిషి వున్నప్పుడు అడిగితే చీదరించుకొని పోయేవాళ్లుకూడా, జతగాళ్ళు వున్నప్పుడు అడిగితే ఇస్తారు. అడగ్గానే ఇవ్వనివాళ్ళు వెంటపడి అడిగితే యిస్తారు. "ఒకసారి లేదంటే పోరాదూ! ఎందుకట్లా విసిగిస్తావు?" అని అనేవారు గాని విసిగించకుండా యిచ్చేవాళ్ళు చాలా తక్కువగానే వుండేవాళ్ళు. పైగా మేము అడిగినట్లూ, తాము ఇవ్వనట్టూ పదిమందికీ తెలుస్తుందనుకున్నప్పుడే ఇచ్చేవాళ్ళు

అట్లా కొన్నాళ్ళు జరిగినై.

మా గుడిసెకు ప్రక్కనే పగటి భాగవతులు ఉండే వాళ్ళు. అందులో ఒకడు పిట్టలదొర వేషం వేస్తూవుండేవాడు. అప్పుడప్పుడూ మా గుడిసెలోకి వచ్చి ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పి నవ్విస్తూ వుండేవాడు. ఎట్టాకుదిరిందో వాడికీ యీగుడ్డిమనిషికీ జత. బాగా జత కుదిరింది. ఏ కాస్త తీరిక వున్నా ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ కూర్చునేవాళ్ళు. గుడ్డిమనిషికి వాడితో చెప్పుకునే కబుర్లు ఏముండేవో!

వాడికిమాత్రం ఎందుకనో నేనంటే గిట్టేదికాదు. నేను ఎప్పుడు కనిపించినా కొరకొర చూస్తూండేవాడు. నెమ్మది నెమ్మదిగా ఆ గుడ్డిమనిషికికూడా అంతకుముందు నామీద వున్న ఇష్టం తగ్గమొదలుపెట్టింది.

చీటికీ మాటికీ పోట్లాడేది. ఏమాటవడితే ఆ మాట అనేది. ఎదురుతిరిగి పోట్లాటి లాభం లేదని నేను తోసుకు తిరిగాను. నాదారిన నన్ను పొమ్మంటే గడిచేది ఎట్లా!

ఒకరోజు నేను నూకలు కొనుక్కురావటానికి బజారు వెళ్ళి తిరిగి వచ్చేటప్పటికి ఆమె ఏడుస్తూకూర్చుంది. ఎందుకా అని నేను గాభరా పడ్డాను. అడగటానికి జంకుపుట్టి ఇటూ అటూ కాసేపు తచ్చాడాను. చివరికి ఆమె గుండె బాదుకుంటూ చెప్పింది. తన చందవాపెట్టెలో వున్న పాతిక రూపాయలూ కాజేసి, ఆ వగటివేషగాడు, ఎక్కడికో పారిపోయాడట.

అప్పుడు నాకు తెలిసింది. వాళ్ళ జోస్తి చాలాలోతుకు వెళ్ళిందని. ఆ గుడ్డిమనిషికి కడుపు. ఆ మాట తెలిసేటప్పటికి నాకు తలతిరిగినంత పని పని అయింది. నేను ఈనాడు పట్టణంలో బతుకుతున్నా అసలు పల్లెటూరు వాణ్ణి. నేనీ నాడు పొట్టకోసం అడుక్కుతింటున్నా, ఇంత నీచానికి పాల్పడే మనుష్యులుంటారని నేను ఎప్పుడు అనుకోలేదు. ఆ వగటి భాగోతుడు అప్పుడు అక్కడ వుంటే, తరువాత ఏమన్నా కానీ ముందు ముక్కెలు యిరగతన్నేవాణ్ణి. కాని ఏమనుకొని ఏం లాభం? వా డక్కడ లేడు. తనపని తను పూర్తి చేసుకుని దాటిపోయాడు. తన మకిలి ఆ గుడ్డి మనిషికి అంటించి వెళ్ళిపోయాడు.

ఆ మకిలి పెరిగి పెద్దదై ఆ గుడ్డిమనిషిని పూర్తిగా కుంగదీసింది. ఈ సంగతి చుట్టుపక్కలవాళ్ళకి తెలిసి సూటీ పోటుమాటలు అనటొచ్చారు. అడుక్కోటానికి బయటకు తీసుకెళ్తే అంతా నన్ను అనుమానంగా చూడ టొచ్చారు. ఒక మారాజు అననే అన్నాడు, "నీకు బుద్ధిలేద్రా? నీ ప్రతాపం చూపటానికి గుడ్డిదే కావలసి వచ్చిందా?" అని. ఆ మాటలకు నాకు పొడుచుకు చచ్చినంత పనయింది. ఇక ఆమెసంగతి చెప్పాలా? గుడ్లులేని కళ్ళదొంతలు నీళ్ళతో నిండేవి. ఎప్పుడైతే చూసే వాళ్ళకు మా మీద జాలి లేకుండా పోయిందో అప్పుడే బిచ్చం ఇవ్వటంకూడా తగ్గిపోయింది.

ఇట్లా ఆమె లోలోపల కుళ్ళిపోయి, నీళ్ళాడే సమయానికి బలహీన పడిపోయి నీళ్ళాడలేక చచ్చి పోయింది. పుటినపిల్ల కూడా చచ్చిపుట్టింది.

ఆమె పోవటంతో అడుక్కుతినటానికి అంతకు ముందున్న ఆ కాస్తా నాకు లేకుండా పోయింది ఇక అడుక్కుతినాలి. ఏ మొహం పెట్టుకొని అడుక్కునేట్టు? అంతకుముందు గుడ్డిది ఒకతె అడ్డున్నది గనుక సరి పోయింది. ఇప్పుడెట్లా అడుక్కోటం? ఏదన్నా పని దొరుకుతుందేమోనని నాలుగయిదురోజులు తిరిగి చూశాను. ఎక్కడా దొరకలేదు. కడుపు కాలుతూ వుంది. అడుక్కోవటంమొదలు పెట్టాను. నా కోసం అడుక్కోలేక నాభార్య ఆస్పత్రిలో చచ్చిపోయిందనీ, శవాన్ని తగలెయ్యటానికి డబ్బులేదనీ అనుక్కోవటంమొదలు పెట్టాను. ఆనాటినుంచీఈనాటివరకూఅడుక్కుంటూనే వున్నాను. రకరకాల వేషాల్లో అడుక్కుంటున్నాను. అడుక్కోటానికి వేషాలు ఎందుకు అంటారా? వేషాలు వెయ్యకుండా, "నాకు ఆకలి అవుతూ వుంది" అంటే ఎవ్వరు పెడతారు అన్నం!

ఒకసారి, వేషాలు వెయ్యటంతో విసిగి నేరుగా అడుక్కోవటం మొదలు పెట్టాను. ఒక మేడముందు ఆగి, "బిచ్చం పెట్టమ్మా" అని కేక వేశాను.

"ఎద్దులాగా వున్నావు పని చేసుకోలేవు?" అన్నాడు.

తిండిలేక చచ్చే నేను ఎద్దులాగా వున్నానట! మరి ఆయన కళ్ళకు అట్లా కనపడుతున్నా కామాలు! పనిచేసుకో మంటాడు, ఎక్కడ దొరుకు తుంది పని? పోనీ, వీళ్ళందరూ పనిచేసుకునే పొట్టలు పెంచుకుంటున్నారా? తలిదండ్రుల నుంచి వచ్చిందానిమీదేగా బతుకుతుంది! ఈయన పుట్టుకు ఈయనకు రెండు పెద్ద పెద్ద మేడలున్నాయి. అవి అద్దెకు ఇచ్చి వాటిమీద వచ్చేదాంతో కాలుమీద కాలు వేసుకొని బతుకుతున్నాడు. మావంటివాళ్ళు కనిపిస్తే "పనిచేసుకోలేవూ" అంటాడు. పనంటే ఇదేనా? ఈయన చేసే దేనా? వాళ్ళ కట్లా కనిపిస్తుంది. నాబోటివాళ్ళు ఏదన్నా అంటే కన్నుమని ఇంత ఎత్తున లేస్తారు.

"బాబూ" అని ఇంకేదో చెప్పబోయాను. చెప్పే దేముంది నా కొంద, బతిమాలబోయాను.

ఆయన ఇంత ఎత్తున లేచాడు. "చెప్పేది నీ క్కాదట్రా? వెళ్తావా, మెడమీద కర్రవేసి గెంటించ మంటావా?" అని నానా బండబూతులు కూశాడు. కొట్టటానికి మీద మీదకు వచ్చాడు.

ఏం చెయ్యాలి? ఇంకేమన్నా అంటే తంతాడు కూడాను. ఎవ్వరికి చెప్పుకోవాలి? ఇంకా ఏదన్నా అంటే పోలీసులను పిలిపిస్తాడు. మా మొర ఆలకించేసి ఎవ్వరు "నాకు చెప్పొచ్చావు. నువ్వుపడే కష్టంమాత్రం ఏమిటి!" అని అడిగానే అనుకోండి. జనం వూరుకుంటారా, ఊరుకోరు. "నీ కెంత పొగర్రా" అని తలొకటీ తగిలిస్తారు. అడగవలసినవి నాబోటి వాళ్ళకే చాలావున్నాయి. అయినా జనానికి జడిసి నోరు నొక్కుకుని వూరు కుంటాం. ఊరుకోకపోతే గడిచేది ఎట్లా!

ఆరోజు తేల్చుకున్నాను, నేరుగా అడుక్కోకూడదని; ఆకలి అని అడిగినంత మాత్రాన అన్నం పెట్టేవాళ్ళు వుండరని. అప్పటినుంచీ రక రకాల వేషాలతో పొట్ట పోసుకుంటున్నాను. ఒకరోజు ఇంకొక బిచ్చగాడు కలిశాడు. వాడూ నాలాంటివాడే. "ఇక్కడేముంది; గుడిదగ్గరైతే డబ్బు బాగా దొరుకుద్ది." అన్నాడు వాడు, ఇద్దరం బయలుదేరాం. అప్పటి నుంచీ ఇక్కడే వుంటున్నాం.

ఇక్కడైనా నేరుగా ఆకలి అవుతూవుందని చెపితే ఎవ్వరూ డబ్బివ్వరు. వేషాలు వేస్తేనే డబ్బిచ్చేది. ఏ కుంటివాడిగానో, గుడ్డివాడిగానో ఏ కుష్టువాడిగానో కనపడాలి. అప్పుడుగాని డబ్బివ్వరు. అందుకని మేమంతా తలొకవేషం వేస్తాం. ఇక్కడ ములగిచెట్లు ఎక్కువగా వున్నాయి. దేవుడు ఈ ములగ చెట్లను ఇక్కడ మాకోసమే పెంచి వుంటాడు. ములగబంక తెల్లగానూ ఎర్రగానూ వుంటుంది. అది ఏ కాలికో, చేతికో, వీపుకో పట్టిస్తే అక్కడ చీముతోను నెత్తురుతోనూ వున్న పెద్ద పుండులాగా వుండి చూసే వాళ్ళకు అసహ్యంగానూ, గాభరాగానూ కనుపిస్తుంది నేను అది పూసు కొని నొప్పి నోర్చుకోలేనట్లు ఏడుస్తూ కూర్చుంటాను. మధ్య మధ్య పుండు పోటు పెడుతున్నట్లు పెడబొబ్బలు పెడుతూ వుంటాను. దేవుణ్ణి చూట్టానికి

వెళ్ళేవాళ్ళు నన్ను చూడకుండా వుండరు. చూసి ఎంతోకొంత ఇవ్వకుండా వుండరు. బాగానే గడిచిపోతా వుంది.

అయితే మేము చేస్తున్న తతంగం గుడి యజమానులకు తెలియదా— అని మీకు అనుమానం రావచ్చు. తెలుసు, ఎందుకు తెలియదు? అయితే మేము కూర్చునే స్థలానికి వాళ్ళు అద్దె తీసుకుంటూ వుండేవాళ్ళు. అంటే నేరుగా మా దగ్గర తీసుకునేవాళ్ళు కాదు. ఆ స్థలం అద్దెకు వేలం పాడే వాళ్ళు పాటలో కొట్టేయించుకున్న వాళ్ళు రోజుకి బేడకీ పావలకీ మాకు అద్దెకు యిచ్చేవాళ్ళు. మా మా వరుమానాన్ని బట్టి స్థలం చిన్నదో పెద్దదో మేము అద్దెకు తీసుకుంటూ వుండేవాళ్ళం.

ఇది మోసం కాదా?— అని మీరు అడగవచ్చు. మోసమేనేమో? కాని యీ మాత్రం మోసం చెయ్యనిది ఎవ్వరు? ఒక వేళ ఇది మోసమే అయితే మేము జరగక మోసం చేస్తున్నాం. బాగా జరుగుతున్నా మోసం చేసే వాళ్ళ సంగతి ఏమిటి? మాకు పొట్ట గడవాలి. ఆకలి అవుతా వుంది. అన్నం పెట్టమంటే ఎవ్వరూ పెట్టరు. అందుకని యీ వృత్తిలోకి దిగాం. కాని కావలిసినంత డబ్బు వుండి, నిజాయితీగా వుండే అవకాశం వుండి మోసం చేసే వాళ్ళ మాటేమిటి? తిండికి లేనివాళ్ళం గనుక యేమన్నా పరవాలేదని మమ్మల్ని అంటారు గాని, మోసం చెయ్యంది యెవ్వరు? ఇతరుల మాటెందుకు? మీ మాట చెప్పండి. మీలో వొక్కరయినా మోసం చెయ్యకుండా బతుకుతున్నారా? క్షణానికి వొక్క మోసం చెయ్యకుండా బతుకుతున్నారా? క్షణానికి వొక్కసారయినా మోసం చెయ్యకుండా వుంటున్నారా? ఇక మమ్మల్ని అంటారు ఎందుకు?

అదుగో మా వాళ్ళంతా బయలుదేరుతున్నారు. వాళ్ళ వేషాలన్నీ పూర్తయినాయి. మీరు ఆఫీసుకి ఎప్పుడూ వేసుకునే బట్టలే వేసుకొని వెళతారా? వెళ్ళరు. నేను పట్టణంలో వున్నప్పుడు చూశాను. కోటూ లాగూ వేసుకుని మెడకు యేదో గుడ్డపీలిక చుట్టుకుని వెళతారు, మేమూ అంతే. ఏ వృత్తిలో వున్నవాళ్ళు ఆ వృత్తికి తగ్గ దుస్తులు వేసుకొని వెళ్ళాలి.

మాటల్లోపడి నేను వేషం వేసుకోటం ఇప్పటిదాకా మరచిపోయాను.

అదుగో మా వాళ్ళంతా వేషాలు పూర్తి చేసుకున్నారు. ఆ సాధువుని చూశారా? ఆ జెడలన్నీ మర్రిచెట్టు పాలతో తయారయినవే. మంచి మంచి తత్వాలు నేర్చుకున్నాడు; అని పాడుతూ కూర్చుంటాడు. అన్నీ తెలిసిన నాకే అతను పాడుతుంటే, 'నేను పొరపాటుపడ్డాను. నిజం సాధువే లాగుంది' అనిపిస్తుంది. ఏదైనా అలవాటు చేసుకోవటంలో వుంది. మా జమీందారు అంటుండేవాడు, 'అభ్యాసం కూసువిద్య' అని.

వింటున్నారా? కదలకుండా కూర్చున్న నన్ను చూచి, 'ఇంకా కదలవేం?' అంటున్నాడు సాధు

నే నింకా ములగబంక ఒంటికి పట్టించుకోవలసి వుంది. ములగబంక మొదట్లో వూరికే దొరికింది ఇప్పుడా ఆసామీ తడవ తడవకీ వేడ తీసుకోకుండా యివ్వడు. ములగబంక మేము ఎందుకు కొంటూ వుందీ ఆయనకు తెలుసు. అయినా తెలియనట్లు నటిస్తాడు! మేమూ ఏదో పనివుండి కొన్నట్లు కొంటుంటాం. ఆయన ఆ వూర్లో పెద్ద మనుష్యుల్లో వొకడు. గుడి పెత్తందారుల్లో ఒకడు. ఆ వూరికి యే గొప్పవాడు వచ్చినా, ఆయన ఇంట్లోనే దిగుతాడు. ఆయన మీటింగుల్లో ఉపన్యాసాలు కూడా ఇస్తాడు. ఒకరోజు అటుపక్కగా పోతూ ఆయన వుపన్యాసం విన్నాను. ఉపన్యాసం అవగానే అంతా ఆయన పేరుచెప్పి 'జై, జై' అని కేకలు వేశారు. 'ములగబంకకూ జై' అని నాకు కేకవెయ్యబుద్ధి అయింది! 'మనకి ఎందుకు వచ్చిందిలే' అని వూరుకున్నాను.

'కదలవేరా!' అని మళ్ళీ కేకలేస్తున్నాడు సాధు. తాగేబీడీ నోట్లోనుంచి తీసి, బూతులు కూసి తుపుక్కున వూస్తున్నాడు. ప్రతిమాటకి ఒక బూతు కలపటం మాకు రివాజు.

నేను నెమ్మదిగా లేచాను. మరచేపోయ్యాను. ఇవ్వాళ గుడిలో యేదో ఉత్సవం జరుగుతావుంది. పెద్ద పెద్ద వాళ్ళంతా వస్తారు. బాగా జనం వస్తారు. పెందలాడే వెళ్ళాలి. నాలుగు డబ్బులు గిట్టుబాటయ్యే రోజు యిది.

* * * *

మేము వెళ్ళి సోలుపుగా మా మా స్థలాల్లో కూర్చుని ఎవ్వరి పని వాళ్ళం ప్రారంభించేం. సాధువు పాటను లంకించుకున్నాడు; నేను ఏడుపుకి లంకించుకున్నాను ఒక్క క్షణంలో మా కేకలతో చెవులు చిల్లులు పడ జొచ్చినై. జనం బాగా వచ్చారు. గుళ్ళో వెళ్ళేవాళ్ళు వెళుతున్నారు, తిరిగి వచ్చేవాళ్ళు వస్తున్నారు. డబ్బులు బాగానే గిట్టుబాటు అవుతున్నాయి. ఒక పెద్దాయన కారులో వచ్చాడు. గుడి పెద్ద, పూజారి, ఊళ్ళో మాకు ములగ బంక అమ్మే పెద్దాయన వున్నాడన్నానే; ఆయనా ఎదురుగా వచ్చి గుళ్ళోకి తీసుకువెళ్ళి దేవుణ్ణి చూపించి మళ్ళీ తీసుకువచ్చారు. ఆ కారులో వచ్చిన పెద్దాయన మమ్మల్నందర్నీ ఒక్కసారి చూశాడు. "వీళ్ళందర్నీ ఇక్కడ నుంచి పంపించి వెయ్యటం మంచిది" అన్నాడు.

ఆ మాటలకు మా ప్రాణాలు గతుక్కుమన్నాయి.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను. యెక్కడికి పంపుతాం? యెక్కడికన్నా పంపితే దొంగలుగా తయారై జనాన్ని వేపుకుతింటారు" అన్నాడు, మాకు ములగబంక అమ్మే పెద్దమనిషి.

"ఏదో చూడాలి" అన్నాడు కారుమీదవచ్చిన పెద్దమనిషి.

"అనాదినుంచీ దేవుణ్ణి ఆశ్రయించుకొని బ్రతుకుతున్నారు. ఇదీ ఒకందుకు బాగానే వుంది. వుండనివ్వండి. మనకేం నష్టం" అన్నాడు ములగబంక అమ్మే పెద్ద మనిషి.

"భగవంతుడికి నగలూ నాణ్యాలూ ఎంత అవసరమో, బీదవాళ్ళ ఏడుపులూ, మొత్తుకోళ్ళూ అంత అవసరం. వీళ్ళ ఏడుపులూ మొత్తుకోళ్ళు వినబడకపోతే, భగవంతుడికి నిద్రపడుతుందని నేను అనుకోను. ఎందుకు భగవంతుడికి కష్టం కలిగించాలి? ఈ గుడి కట్టించిన దగ్గరనుంచీ వీళ్ళు వుంటున్నారు. ఉండనివ్వండి" అన్నాడు పెద్దపూజారి.

నేను ఒక్క క్షణం యేడుపు ఆపి తుసుక్కున నవ్వుకున్నాను. ఇక మాకు వచ్చిన యిబ్బంది ఏమీలేదు. కాకపోతే పూజారి మామూలు ఎక్కువ అడుగుతాడు; ములగబంక ధర యెక్కువ పలుకుతుంది!